సాక్షి
వికారాబాద్
సోమవారం । 22 । ఏప్రిల్ । 2024



చెరువు మట్టి.. చేనుకు పుష్టి

చెరువు మట్టితో సాగుభూములకు సహజ స్వభావం తిరిగి వస్తుందని ఆదిశగా పనులు చేపట్టాలని నిపుణులు అంటున్నారు. 8లో▸



గెలుపు ఖాయం

చేవెళ్ల నుంచి తన తండ్రి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం ఖాయమని విశ్వజిత్‌రెడ్డి స్పష్టం చేశారు. 8లో▸



తెల్లజొన్న..లాభాలు మిన్న

పెట్టుబడి తక్కువ లాభాలు ఎక్కువగా ఉండటంతో తెల్లజొన్న సాగుపై రైతులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున మాదిగ



చెంగోల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తాండూరు రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలు బీజేపీకి మద్దతుగా నిలవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం తాండూర్ మండలంలోని చెంగోల్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మాదిగలు అండగా నిలవాలన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ప్రతి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తామని అన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు మాదిగ, ఎంఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ శివాజీ మాదిగ, మండల అధికార ప్రతినిధి ప్రవీణ్ మాదిగ, నాయకులు జగదీష్, శ్రీనివాస్, శాంతికుమార్, రాములు, నజీర్, ఆనంద్ ఉన్నారు.

ఘనంగా బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన



బోనాలతో మహిళలు

ధారూరు: ధారూరులో ఇటీవల ప్రతిష్ఠించిన భిన్నమైన బొడ్రాయిని తొలగించి దాని స్థానంలో కొత్త బొడ్రాయిని ఆదివారం ప్రతిష్ఠించారు. వేద పండితుత మంత్రోచ్ఛరణ నడుమ ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో బొడ్రాయి చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

సూర్యప్రభ, గరుడ వాహనాలపై 'బాలాజీ'

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా కలియుగదైవం వేంకటేశ్వర స్వామి సూర్యప్రభ, గరుడ వాహనాలపై ఊరేగారు. స్వామివారికి ఆదివారం వాహన సేవలు అందించారు. మొదట సూర్యప్రభ వాహనంపై, తరువాత గరుడ వాహనంపై స్వామివారిని ఆలయ పుర వీధుల్లో ఊరేగించి సేవలు అందించారు. స్వామివారి ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకల్లో ఆలయ తిరుమల కిరణాచారి, పరావస్తు రామాచారి, ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాలకృష్ణస్వామి,అర్చకులు రంగరాజన్, నరసింహన్, కిట్టు, కన్నయ్య, సురేష్, అనిల్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, మాజీ వైస్ ఎంపీపీ జీఎస్ రాజు, నాయకులు జయవంత్, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించుకుందాం

సమాచార మాజీ కమిషనర్ వెంకటేశ్వర్లు

ఇబ్రహీంపట్నం రూరల్: దేశంలో చట్టాలు సమగ్రంగా అమలు కావాలంటే, ప్రజాస్వామ్య పరిరక్షణ జరగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమాచార మాజీ కమిషనర్ డాక్టర్ వర్రి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని మున్నూరుకాపు సంఘం భవనంలో సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రమాద కృష్ణారెడ్డి అధ్యక్షతన ఆదివారంనిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వస్తే ప్రతి నిరుపేత మహిళకు ఏడాదికి లక్ష రూపాయలు ఇస్తామని కాంగ్రెస్ అగ్ర నాయకులు ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ఎక్కువ లోక్‌సభ స్థానాలు గెలవాలని ఆకాంక్షించారు. భువనగిరి స్థానం నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కేంద్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజనీర్ ఇన్‌చీఫ్ పంచాయతీరాజ్ ఎంఏ ఖరీం, సమాచార హక్కు చట్టం వికాస సమితి వ్యవస్థాపకుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శిఖుర్షీద్‌పాషా, ఫెడరేషన్ హెచ్ఆర్సీ అధ్యక్షుడు రామ్మోహన్, జిల్లా అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్వాసకు సంకటం

దేశ రాజధాని ఢిల్లీ కంటే తాండూరు ప్రాంతంలో కాలుష్యం అధికంగా ఉందని గతంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తేల్చిచెప్పినప్పటికీ కాలుష్య నియంత్రణకు స్థానిక అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై మండిపడుతున్నారు. చర్మంపై దద్దుర్లు రావడం, తుమ్ములు, దగ్గుతో అవస్థలు పడుతున్నామని.. జిల్లాలో అలర్జీ మహమ్మారి చాపకింద నీరులా వ్యాపిస్తోన్నప్పటికీ ఆరోగ్య,వైద్యశాఖ అధికారులు నివారణ చర్యలు చేపట్టడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రచంప అలర్జీ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక కథనం..



తాండూరు-చించోలీ రహదారిపై లారీల రాకపోకలతో కమ్ముకున్న దుమ్ము

జిల్లాలో పెరుగుతున్న అలర్జీ బాధితుల సంఖ్య

- చర్మంపై దద్దుర్లు, అస్తమాతో అవస్థలు
- వాతావరణ కాలుష్యమే కారణమంటున్న వైద్య నిపుణులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

తాండూరు: విపరీతంగా పెరిగిపోయిన వాతావరణ కాలుష్యం కారణంగా జిల్లాలో వేలాది మంది ఇప్పటికే అలర్జీ, అస్తమా లాంటి వ్యాధుల బారినపడి ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తాండూరు ప్రాంతంలో అలర్జీ, అస్తమా కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని.. దీని కారణంగా ప్రజల్లో రోగనిరోధక శక్తి తగ్గిపోతోందని వైద్య నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పదిమందిలో 8 మంది వరకు అలర్జీ, అస్తమా బాధితులున్నారంటే ఈ మహమ్మారి ఎంతగా విస్తరించిందో తెలుస్తోంది. అలర్జీ (హైపర్ సెన్సివిటీ) విస్తృతంగా ప్రబలుతున్నా కాలుష్యాన్ని నివారించే దిశగా ఎలాంటి అడుగులు ముందుకు పడటం లేదు. దీనికి తోడు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్లలో కూడా వైర్లు కాలుస్తుడంతో దట్టమైన పొగ వెలువడి వాయికాలుష్యం ఏర్పడుతోంది.

పరిశ్రమల కారణంగానే..

తాండూరు ప్రాంతంలో పెద్దఎత్తున నాపరాతి పరిశ్రమలు, సిమెంట్ కర్మాగారాలు ఉండటంతోనే వాతావరణ కాలుష్యం ఏర్పడుతోందని విమర్శలున్నాయి. ఈ ప్రాంతంలో రోజూ వేలాదిగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో దుమ్ము, ధూళితో వాయు కాలుష్యం ఏర్పడుతోంది. అదే గాలిని పీల్చడం ద్వారా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. తాండూరు-కర్ణాటక సరిహద్దులో ఐదు భారీ సిమెంట్ కర్మాగారాలు ఉన్నాయి. వీటిద్వారా వెలువడే కాలుష్యం ద్వారా ఈ ప్రాంతంలో శ్వాసకోశ, అలర్జీ, అస్తమా వ్యాధులు అధికంగా వ్యాపిస్తున్నాయని వైద్యులు అంటున్నారు.అలర్జీ సోకినవారిలో అంతులేని చిరాకుతో పాటు మానసిక ఒత్తిడి ఉంటుందని.. ముందస్తు నివారణ చర్యలతో వీటి నుంచి బయటపడే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

15శాతానికి పడిపోయిన అడవులు..

పరిశ్రమలపై పర్యవేక్షణతో పాటు అడవులశాతం పెంచడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. జిల్లాలో 32 శాతం ఉండాల్సిన అటవీ ప్రాంతం ప్రస్తుతం 15 శాతంలోపే ఉంది.. ఉన్న అటవీ ప్రాంతంలోనైనా ఆశించినంతగా పచ్చదనం కనిపించడం లేదు. దీనికి తోడు నిబంధనలకు విరుద్ధంగా వాతావరణానికి హాని కలిగించేలా సిమెంట్ కర్మాగారాలు,రసాయన, లిక్కర్ పరిశ్రమలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం పరిశ్రమలకు ఏటావచ్చిన ఆదాయంలో కొంత శాతం పర్యావరణ పరిరక్షణకు కేటాయించాలి. అయితే వారు అలాంటి నిబంధనలు ఏవీ పాటించడంలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాలుష్యం అధికంగా ఉంది



తాండూరు ప్రాంతంలో కాలుష్యం అధికంగా ఉంది. దీనిని నివారించాలని ఏడేళ్లుగా నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ చుట్టూ తిరిగాను. ఈ క్రమంలో పర్యావరణాన్ని పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని గతంలో గ్రీన్ ట్రిబ్యునల్.. స్థానిక అధికారులను ఆదేశించింది. అయినప్పటికీ ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వాతావరణంలోని కాలుష్యాన్ని పీల్చే స్మాగ్‌టవర్‌ను ఏర్పాటు చేయాలి. పర్యావరణ పరిరక్షణకు వృక్ష సంపదను పెంచాలి.

– రాజ్‌గోపాల్ సార్డా, పర్యావరణవేత్త, తాండూరు

ఊపిరితిత్తులు పాడవుతాయి



కాలుష్యం కారణంగా చిన్న పిల్లలు, వృద్ధుల్లో అలర్జీ, అస్తమా వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉంది. అలర్జీతో ఊపిరితిత్తుల సమస్యలు వస్తాయి. వాతావరణంలో మార్పులు ఏర్పడిన సమయంలో అలర్జీ తీవ్ర ఇబ్బందులు పెడుతుంది. ఈ వ్యాధి సోకినవారు హోమియోపతి, ఆయుర్వేదం, నాటు వైద్యం చేయించుకుంటున్నారు. ఇది సరికాదు. సరైన వైద్యం తీసుకున్నప్పుడే అలర్జీ నుంచి విముక్తి పొందుతారు.

– విష్ణురావు, శ్వాసకోశ వైద్య నిపుణుడు

మెరుగైన వైద్యం అందిస్తున్నాం



ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రతిరోగికి మెరుగైన వైద్యం అందిస్తున్నాం. శ్వాసపరమైన రుగ్మతలతో వచ్చే కేసులు, అలర్జీ కేసుల వివరాలను ప్రత్యేకంగా మానిటరింగ్ చేస్తున్నాం. అలర్జీ బాధితులకు తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి, వికారాబాద్ ఆస్పత్రిలో నిష్ణాతులైన వైద్యులు అందుబాటులో ఉన్నారు. ప్రజలు ఆందోళన పడవద్దు. సరైన వైద్యంతో ఈ వ్యాధులను నివారించవచ్చు.

– డాక్టర్ పల్వాన్ కుమార్, డీఎంహెచ్ఓ, వికారాబాద్



సమవేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ వస్తేనే కరువు

మహబూబ్‌నగర్ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి

కేశంపేట: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే కరువు వస్తుందని, కరువుకి కాంగ్రెస్ పార్టీకి అవినాభవ సంబంధం ఉందని మహబూబ్‌నగర్ ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శారద ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆధ్వర్యంలో కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో కరువు రాకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కన్నా కేసీఆర్ పాలనాదక్షతలో చాలా గొప్పవారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో అసాధ్యమైన హామీలు ఇచ్చి గెలుపొందిందని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక ఆ పార్టీ నాయకులు సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. బీజేపీ గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయలేదన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్గనమోని రవీందర్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పల్లె నర్సింగ్‌రావు, మాజీ ఎంపీపీ సజ్జల విశ్వనాథం, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు రాంబాల్‌నాయక్, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు లక్ష్మీనారాయణ గౌడ్, నారాయణరెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి,శేఖర్‌రెడ్డి, యాదగిరిరావు, జమాల్‌ఖాన్, రమేష్‌యాదవ్, నవీన్‌కుమార్, మల్లేశ్‌యాదవ్, శ్రీను, లక్ష్మీనారాయణ, రాజ్యలక్ష్మి, యాదయ్యాచారి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలు వచ్చేశాయ్..

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం ఈవీఎంలు ఆదివారం షాద్‌నగర్‌కు వచ్చాయి. భారీ బందోబస్తు మధ్య వచ్చిన ఈవీఎం, వీవీ ప్యాట్లను ఆర్డీఓ వెంకటమాధవరావు ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పట్టణంలోని మినీస్టేడియంలో ఉన్న స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. పోలింగ్ నిర్వహణ కోసం షాద్‌నగర్‌కు మొత్తం 328 ఈవీఎంలు, 368 వీవీ ప్యాట్లు, 328 కంట్రోల్ యూనిట్లు వచ్చాయి. స్ట్రాంగ్ రూం చుట్టూ ప్రత్యేక పోలీసు బృందాలతో నిఘా ఏర్పాటు చేశారు. పోలింగ్‌కు ఒకరోజు ముందు ఎన్నికల సిబ్బందికి ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్లు, ఎన్నికల సామగ్రి పంపిణీ చేయనున్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్‌సభ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నుంచి ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి ఈవీఎం మిషన్లు ఉదయం 11 గంటలకు రెండు ట్రక్కుల్లో వచ్చాయి. వీటిని ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. కార్యక్రమంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



చేవెళ్ల: బీఎస్ఐటీ కళాశాలలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరుస్తున్న ఈవీఎంలు, వీవీ ప్యాట్లు

బీఎస్ఐటీ కళాశాలలో..

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని అధికారులు ఒక్కొక్కటిగా స్ట్రాంగ్‌రూమ్‌లకు చేరవేస్తున్నారు. మండలంలోని గొల్లపల్లి సమీపంలో ఉన్న బండారు శ్రీనివాస ఇంజనీరింగ్ (బీఎస్ఐటీ) కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు ఆదివారం ఈవీఎంలు, వీవీ ప్యాట్ మిషన్‌లు చేరుకున్నాయి. వీటిని అధికారులు పోలీస్ బందోబస్త్ మధ్య, వివిధ పార్టీల నాయకులు, అధికారుల సమక్షంలో స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. లోక్‌సభ ఎన్నిలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు.



టీఆర్ఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సర్పంచ్‌ల సంఘం పూడూర్ మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, నాయకులు.. జగన్, అశోక్, రామయ్య, నర్సింహులు, రాములుగౌడ్, అంజయ్య, శ్రీనివాస్, రవి, శ్రీహరి ఆదివారం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపుకోసం కృషి చేయాలని నాయకులకు సూచించారు. కష్టపడి పని చేసేవారికి తగిన గుర్తింపు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు పాల్గొన్నారు.

దైవభక్తి కలిగి ఉండాలి..

ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లిలో ఆదివారం శ్రీ పోచమ్మ, నాగదేవత, ఆంజనేయస్వామి విగ్రహాల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పునఃనిర్మాణానికి సహకరించిన దాతలు.. చేవెళ్ల గ్రామానికి చెందిన మద్దెల జంగయ్య, సంతోష దంపతులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం, డీసీసీ కార్యదర్శి షకీల్, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, ఎంపీటీసీ నాగమణి, సొసైటీ డైరెక్టర్ చెన్నయ్యగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వలస బతుకులు



ఓగిపూర్‌లోని ఓ నాపరాతి గనిలో బండరాళ్లను లోడ్ చేస్తున్న కూలీలు

- బతుకుదెరువు కోసం జార్ఖండ్ బీహార్ తదితర రాష్ట్రాల నుంచి రాక
- తాండూరు మండలం ఓగిపూర్, కరన్‌కోట్ నాపరాతి గనుల్లో పనులు
- ఎండ వేడిమిలో సైతం అలుపెరగని శ్రమ
- రోజుకు రూ.700 నుంచి రూ.1000 వరకు కూలీ

తాండూరు రూరల్: జానెడు పొట్ట, భార్య, పిల్లల కోసం రాష్ట్రం కాని రాష్ట్రంలో వచ్చి వలస బతుకులు బుతుకుతున్నారు. నాపరాతి గనుల్లో పెద్దపెద్ద బండరాళ్లను పగుళగొట్టడంతో పాటు లారీల్లో లోడింగ్ చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వికారాబాద్ జిల్లాలోని తాండూరు మండలం ఓగిపూర్, కరన్‌కోట్ నాపరాతి గనుల్లో పనిచేస్తున్న వలస కూలీల పరిస్థితిపై 'సాక్షి' ప్రత్యేక కథనం. బీహార్, జార్ఖండ్, ఉత్తర్ ప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల నుంచి కార్మికులు బతుకు దెరువు తాండూరు మండలంలోని ఓగిపూర్, కరన్‌కోట్ గ్రామాల శివారుల్లోని నాపరాతి గనుల్లో పనులకు చేరారు. కరన్‌కోట్, చుట్టుపక్కల గ్రామాల్లో భార్య, పిల్లలతో కలిసి చిన్నచిన్న అద్దెగదుల్లో నివాసముంటున్నారు. రోజూ ఇక్కడ నుంచి లారీల్లో గనులకు వెళ్లి పనులు చేస్తున్నారు.

వేసవిలోనే పనులు..

గనుల్లో పెద్దపెద్ద బండరాళ్లను పగులకొట్టడం, వాటిని లారీల్లో ఎక్కించడం వంటి పనులు చేస్తుంటారు. రోజుకు రూ.700 నుంచి రూ.1000 వరకు కూలీ వస్తుందని కార్మికులు తెలిపారు. నాపరాతి గనుల్లో ఏడాదిలో ఎక్కువగా వేసవికాలంలోనే పనులు ఎక్కువగా కొనసాగుతాయి. వర్షాకాలం వచ్చిందంటే గనుల్లో వర్షపు నీరు చేరడంతో కార్యకలాపాలు స్తంభించిపోతాయి. ఫిబ్రవరి-మే నెల మధ్యలో ఎక్కువగా పనులు ఉంటాయి. వర్షాకాలం వచ్చిదంటే కార్మికులు సొంతూర్లకు వెళ్లిపోతుంటారు. పని ప్రదేశంలో వసతులు కల్పించడంతో పాటు కూలీలు పెంచాలని కార్మికులు కోరుతున్నారు.

బండరాళ్లు మోస్తున్నాను



నేను జార్ఖండ్ రాష్ట్రంలోని పనసాబి గ్రామం నుంచి భార్యపిల్లలను వదిలి ఇక్కడికి పనికోసం వచ్చాను. ప్రతిరోజు పెద్దపెద్ద బండరాళ్లు మోస్తే రూ.700 నుంచి రూ.1000 వరకు వస్తాయి. కరన్‌కోట్‌లోని చిన్న అద్దెగదిలో ఉంటున్నాను.

– ఉమేష్ సాహు, వలస కార్మికుడు, జార్ఖండ్

పొట్టకూటి కోసం తప్పదు



మా సొంత రాష్ట్రం బీహార్‌లో పనులు లేకపోవడంతో తాండూరుకు వలస వచ్చాను. నాపరతి గనుల్లో పనిచేస్తున్నాను. బండరాళ్ల మోసే క్రమంలో బండ కిందపడితే కాళ్లు, చేతులు విరిగిపోయే ప్రమాదం ఉంది. అయినప్పటికీ పొట్టకూటి కోసం తప్పదు.

– నారాయణ, వలస కార్మికుడు, బీహార్

కార్పొరేట్ శక్తులకు బీజేపీ వత్తాసు

కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ సంఘం రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య నాయక్

షాద్‌నగర్: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలుకుతోందని కాంగ్రెస్‌పార్టీ ఆదివాసీ సంఘం రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివాసీ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బెల్లయ్య నాయక్ అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి చేసింది శూన్యమని అన్నారు. పేదల బ్యాంకుల ఖాతాల్లో రూ.15లక్షల జమ, నల్లధనం వెలికితీత, ఏటా రెండు కోట్ల ఉద్యోగాల వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా పర్యటిస్తూ బీజేపీ ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి చైతన్య పరచాలని సూచించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్, నాయకులు రమేష్ నాయక్, లింగం నాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధే ధ్యేయం

కడ్తాల్: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ సంఘం రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయాన్ని ఆదివారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడాన్ని బీఆర్ఎస్ పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే విష ప్రచారానికి ఒడిగట్టారని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ఆ పార్టీ కనుమరుగు కాక తప్పదన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్, జిల్లా నాయకుడు జవహర్‌లాల్, నాయకులు తుల సీరాంనాయక్, చిన్నానాయక్, ప్రవీణ్, సికిందర్, గోపి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బెల్లయ్య నాయక్

క్లుప్తంగా

25న కంటి వైద్య శిబిరం

కొడంగల్‌: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో ఈ నెల 25న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌ క్లబ్‌ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ శిబిరాన్ని కంటి సమస్యలున్నవారు వినియోగించుకోవాలన్నారు. పరీక్షలకు వచ్చే వారు ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలన్నారు. సమస్యలు ఉన్నవారికి మహబూబ్‌నగర్‌ జిల్లా కేంద్రంలోని కందూరు రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచిత ఆపరేషన్లు చేయిస్తామన్నారు. జిల్లా కలెక్టర్‌, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, లయన్స్‌క్లబ్‌ సంయుక్త ఆధ్వర్యంలో వైద్య శిబిరం జరుగుతుందని ఆప్తాల్మిక్‌ అధికారి లయన్‌ హరినాథ్‌ వివరించారు.

బుగ్గ రామ లింగేశ్వర స్వామి జాతర షురూ

బంట్వారం: కోట్‌పల్లి మండల పరిధిలోని శ్రీ బుగ్గ రామలింగేశ్వర ఆలయంలో ఆదివారం నుంచి జాతర మహోత్సవం ప్రారంభమైందని ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు ఆదివారం పల్లకి సేవ, ధ్వజ రోహనం ఉత్సవాలతో జాతర ప్రారంభమైందన్నారు. 25న స్వామి వారి పల్లకీ సేవతో ఉత్సవాల ముగింపు ఉంటుందన్నారు.

'కారు' దిగిన రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు



కేఎల్‌ఆర్‌ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్‌ నాయకులు

బడంగ్‌పేట్‌: బడంగ్‌పేటకు చెందిన బీఆర్‌ఎస్‌ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రె కృష్ణ కాంగ్రెస్‌ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్‌ సమక్షంలో తన అనుచరులతో కలిసి హస్తం గూటికి చేరారు. పార్టీలో చేరిన వారిలో నవీన్‌ ఠాకూర్‌, కర్రె యాదయ్య, రవి, పూరి, యాదగిరి, వీరితో పాటు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికత చింతనతో మానసిక ప్రశాంతత

షాద్‌నగర్‌ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

షాబాద్‌: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని షాద్‌నగర్‌ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిన్న సోలిపేట్‌ గ్రామంలో ప్రతిష్ఠాపనోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ప్రజలకు ఆలయాలకు వెళ్లినప్పుడు నిష్టతో పూజలు చేయాలన్నా రు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్‌, ఎంపీటీసీ సభ్యురాలు పా న్న జయమ్మవెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నాయకులు రాజేందర్‌రెడ్డి, రమే శ్‌, మహేందర్‌రెడ్డి, కావలి నరేందర్‌, విఠల్‌, కిషోర్‌నాయక్‌, దయాకర్‌, వెంకట్‌రెడ్డి, నర్సింహు లు, మహేశ్‌, ప్రశాంత్‌, సాయి, రమేశ్‌, రాఘవేంద ర్‌, శేఖర్‌, గోపాల్‌రెడ్డి, శేఖర్‌, లోహిత్‌రెడ్డి తదితరులున్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై ప్రయాణికుడి దాడి

విధులకు ఆటంకం కలిగించాడని పోలీసులకు ఫిర్యాదు

అనంతగిరి: వికారాబాద్‌ బస్టాండ్‌లో ఓ ప్రయాణికుడు బస్‌ డ్రైవర్‌పై అకారణంగా చేయిచేసుకున్న సంఘటన ఆదివారం వికారాబాద్‌ పీఎస్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం మధ్యాహ్నం డ్రైవర్‌ రాములు, కండక్టర్‌ స్వాతి వికారాబాద్‌ బస్టాండ్‌లో వికారాబాద్‌-సదాశివపేట రూట్‌లో నడిచే బస్సును ఆపి భోజనం చేస్తున్నారు. ఈ తరుణంలో ఓ ప్రయాణికుడు బస్సు ఇంకెప్పుడు వెళ్తుంది అని ప్రశ్నించగా భోజనం చేస్తున్నాము కొంత సమయం పడుతుందని సమాధానం చెప్పాడు. దీంతో సదరు ప్రయాణికుడు కోపంతో బస్సు ఎక్కిన డ్రైవర్‌పై చేయి చేసుకున్నాడు. ఈ విషయమై వికారాబాద్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు చెప్పారు.

చెరువు మట్టి.. చేనుకు పుష్టి

- పొలాలకు తరలిస్తున్న రైతులు
- తగ్గుతున్న ఎరువుల వాడకం
- పెరుగుతున్న పంట దిగుబడి



పొలంలో నల్లమట్టిని చిమ్ముతున్న రైతు

దౌల్తాబాద్‌: ప్రస్తుత వ్యవసాయం రసాయనాల మయమైంది. రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడుతున్నారు. దీంతో సాగుభూములు సహజ స్వభావాన్ని కోల్పోతున్నాయి. సేంద్రియ కర్బణాలు, పోషకాలు అంతకంతకూ పడిపోతున్నాయి. చెరువుమట్టితోనే సాగు భూములకు సహజ స్వభావం తిరిగి వస్తుందని రైతులు భావిస్తున్నారు. దీంతో మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో చెరువు మట్టిని వ్యవసాయ భూములకు తరలిస్తున్నారు. ప్రస్తుతం సాగు పనులు లేక రైతులు మట్టిని తోలే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులతో భూగర్భజలాలు అడుగంటి మండలంలోని చెరువులు కుంటలు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో ఆయా గ్రామాల్లో చెరువు పూడికతీత పనులు చేపట్టారు. ఆ మట్టిని రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలకు తరలిస్తున్నారు. దూరప్రాంత రైతులకు ఖర్చు అధికంగా ఉన్నా నల్లమట్టి తోలకానికి ఆసక్తి చూపుతున్నారు.

పోషకవిలువలు అధికం

చెరువు మట్టిలో పోషక విలువలు అధికంగా ఉంటాయి. నల్లమట్టిలో సేంద్రియ కర్బనం, సూక్ష్మ పోషకాలు మెండుగా ఉండడంతో మొక్కలు రోగ నిరోధక శక్తిని కలిగి ఉంటాయి. రైతులకు రసాయన ఎరువుల వాడకం తగ్గి పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. దీంతో పంట దిగుబడులు పెరుగుతాయి.

పంట దిగుబడి పెరిగింది



గత యాసంగి సీజన్‌లో రెండు ఎకరాల్లో చెరువు మట్టిని తోలాను. దీంతో యూరియా, పురుగు మందు వాడకం తగ్గింది. గతంలో కంటే పంట దిగుబడి సైతం పది బస్తాలు పెరిగింది. ఈ ఏడాది కూడా చెరువు మట్టిని తోలుతున్నాం.

– బాల్‌రాజు, రైతు, దౌల్తాబాద్‌

భూసారం పెరుగుతుంది



చెరువు మట్టి పోసి ఇసుక దుబ్బ నేలల్లో మంచి పంటలు పండించవచ్చు. నల్లమట్టిలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో పంటకు నీటి నిల్వలు బాగా అందుతాయి. ఎరువులా ఉపయోగపడుతుంది. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఫలితాలు సాధిస్తారు.

– లావణ్య, ఏఓ, దౌల్తాబాద్‌

రైతులకు పరిహారం చెల్లించండి

వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: వడగళ్ల వానకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని ఇబ్రహీంపూర్‌ గ్రామంలో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం వ్యవసాయ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరారు. మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పంటలు చేతికి వచ్చే సమయంలో వడగళ్ల వర్షానికి పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రనష్టపోతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం ప్రకటించి చెల్లించాలన్నారు. ఎకరాలకు రూ.25వేల చొప్పున చెల్లించాలని డిమాండ్‌ చేశారు. లేదంటే రైతుల పక్షాన పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ ముకుందఅశోక్‌ కుమార్‌, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ భాస్కర్‌, సీనియర్‌ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, అశోక్‌వర్ధన్‌ రెడ్డి, రవికుమార్‌, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నేలకొరిగిన వరి పైరును పరిశీలిస్తున్న మహేశ్‌రెడ్డి

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్‌ పోటీలను ప్రారంభిస్తున్న ప్రభుకుమార్‌

తట్టెపల్లి పీఏసీఎస్‌ మాజీ డైరెక్టర్‌ ప్రభుకుమార్‌

పెద్దేముల్‌: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ డైరెక్టర్‌ ప్రభుకుమార్‌ అన్నారు. ఆదివారం తట్టెపల్లిలో మ్యాదరి చంద్రమ్మ వర్ధంతి, మొగులప్ప–చంద్రమ్మ జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్‌ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. ఆటల పోటీలతో స్నేహ బంధాలు బలపడతాయన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ టోర్నమెంట్‌కు సంగారెడ్డి, నారాయణఖేడ్‌, వికారాబాద్‌, హైదరాబాద్‌ ప్రాంతాల నుంచి సుమారు 40 టీంలు పాల్గొన్నాయని తెలిపారు. త్వరలో మండల స్థాయి పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పోటీల్లో విజేత టీంకు రూ.50వేలు, రన్నరప్‌ టీంకు రూ.25 నగదుబహుమతి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్‌ నారాయణగౌడ్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు ఏసప్ప, దేవప్ప, బక్కప్ప, పండరి, రాజు, అంజీ, ఆర్గనైజర్లు సలీం, ముబారక్‌, రాము తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివినవారికి ప్లేస్‌మెంట్స్‌



టాపర్‌కు గోల్డ్‌ మెడల్‌, షీల్డ్‌ అందజేస్తున్న అతిథులు

కేఎల్‌ వర్సిటీ వీసీ డాక్టర్‌ పార్థసారథి వర్మ

మొయినాబాద్‌రూరల్‌: విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉద్యోగాలు వెతుక్కుంటూ వస్తాయని కేఎల్‌ వర్సిటీ వీసీ డాక్టర్‌ పార్థసారథి వర్మ అన్నారు. ఆదివారం కళాశాలలో వందశాతం ప్లేస్‌మెంట్‌ల విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పార్థసారథి వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్లేస్‌మెంట్స్‌లో మొదటి స్థానం సంపాదించిన వారికి గోల్డ్‌మెడల్‌, షీల్డ్‌ ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2024లో ప్లేస్‌మెంట్‌ డ్రైవ్‌లో వర్సిటీ 3,700 ఉద్యోగావకాశాలు సంపాదించిందన్నారు. ఇందులో 20మంది విద్యార్థులకు అంతర్జాతీయ ప్లేస్‌మెంట్‌లు, 296 మంది విద్యార్థులకు అంతర్జాతీయ ఇంటర్న్‌షిప్‌లు లభించాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 400 మందికి పైగా పేరుపొందిన కంపెనీలతో భాగస్వామ్యం ద్వారా ఉద్యోగాలు సాధించడం జరిగిందన్నారు. ఈ సీజన్‌లో పాల్గొన్న ప్రముఖ సెలక్షన్‌లలో గూగుల్‌, మైక్రోసాఫ్ట్‌, సిస్కో, జేపీ మార్గన్‌, ఇంటెల్‌ వంటి గ్లోబల్‌ దిగ్గజాలు ఉన్నాయన్నారు. అదనంగా గూగుల్‌, మైక్రోసాఫ్ట్‌, సిస్కో, జేపీ మార్గన్‌, సర్వీస్‌ నౌ, సిలికాన్‌ ల్యాబ్స్‌, ఆప్టమ్‌, అమేజాన్‌, ఫిలిప్స్‌, సిమెంట్స్‌ ఇంటెల్‌ వంటి ప్రతిష్ఠాత్మకమైన సంస్థలు క్యాంపస్‌లోనే ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. కళాశాలలో టీసీఎస్‌, హెచ్‌సీఎల్‌, నోకియా, కాగ్నిజంట్‌, హెచ్‌సీఎల్‌, ఇన్ఫోసిస్‌, ఎల్‌ అండ్‌టీ మైండ్‌, వంటి పరిశ్రమ దిగ్గజాలు కంపెనీలు విద్యార్థులకు రిక్రూట్‌మెంట్‌ నిర్వహించామన్నారు. విద్యార్థులకు మంచి కెరీర్‌ మార్గాలు చూపించడంలో కేఎల్‌ వర్సిటీ యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కంట్రీ హెచ్‌ఆర్‌ హెడ్‌ దేబాసీస్‌ జెస్‌, డిజిటల్‌ ప్రెసిడెంట్‌ కిరణ్‌ కుచిమంచి, వెల్త్‌ పార్గో ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ హరికూనదరాజు, సాఫ్ట్‌వేర్‌ ఇంజనీరింగ్‌ డైరెక్టర్‌ జే.పి.మోర్గన్‌, ప్రముఖ పరిశ్రమల ప్రతినిధులు పవన్‌ కడియాల, కళాశాల ప్రిన్సిపల్‌ రామకృష్ణ, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌తో ఆరోగ్యం.. ఆనందం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల చైర్మన్‌ కొమురయ్య

రాష్ట్ర స్విమ్మింగ్‌ అసోసియేషన్‌ జాయింట్‌ సెక్రటరీ గిరిధర్‌రావు

మొయినాబాద్‌ రూరల్‌: స్విమ్మింగ్‌ చేయడం వల్ల ఆనందంతోపాటు ఆరోగ్యానికి మేలని రాష్ట్ర స్విమ్మింగ్‌ అసోసియేషన్‌ జాయింట్‌ సెక్రటరీ ఎస్‌.గిరిధర్‌రావు అన్నారు. హిమాయత్‌నగర్‌ రెవెన్యూ పరిధి గండిపేట సమీపంలోని పల్లవి ఇంటర్నేషనల్‌ పాఠశాలలో డెకస్లాన్‌ సహకారంతో మల్క లక్ష్మి మెమోరియల్‌ ఇంటర్‌ స్కూల్‌ స్విమ్మింగ్‌ పోటీలు రెండు రోజుల క్రితం ప్రారంభమయ్యాయి. జంట నగరాల్లోని 83 పాఠశాలల నుంచి 500 మంది విద్యార్థులు నాలుగు విభాగాల్లో పాల్గొన్నారు. ఫ్రీస్టైల్‌, బటర్‌ఫ్లై, బ్యాక్‌ స్ట్రోక్‌, బ్రెస్ట్‌ స్ట్రోక్‌ పోటీలు నిర్వహించారు. ఆదివారం ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి పాఠశాల చైర్మన్‌ మల్క కొమురయ్య విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌.గిరిధర్‌రావు, మల్క కొమురయ్యలు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లనూ రాణించాలని సూచించారు. ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పల్లవి ఇంటర్నేషనల్‌ మెమోరియల్‌ ఇంటర్‌ స్కూల్‌ స్విమ్మింగ్‌ నిర్వాహకులు మల్క లక్ష్మి మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించిన స్విమ్మింగ్‌ పోటీలను వివిధ పాఠశాలల వారు పాల్గొని విజయవంతం చేయడంతో అభినందించారు.

పల్లెటూరులో పఠనాలయం

- రూ.30లక్షలతో గ్రంథాలయం ఏర్పాటు
- నేడు ప్రొఫెసర్‌ కోదండరామ్‌ చేతులమీదుగా ప్రారంభం



నూతన గ్రంథాలయ భవనం



హన్మయ్య దంపతులు

బొంరాస్‌పేట: గతంలో ఇదో కుగ్రామం.. ప్రస్తుతం గ్రామ పంచాయతీ. గ్రామానికి చెందిన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు తన తల్లిపేరిట రూ.30లక్షలు వెచ్చించి గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ఈ గ్రంథాలయాన్ని సోమవారం ప్రొఫెసర్‌ కోదండరామ్‌ చేతులమీదుగా ప్రారంభించనున్నారు. ఇది సీఎం నియోజకవర్గం కొడంగల్‌ మండల పరిధిలోని సంగాయిపల్లిలో హన్మయ్య పుస్తక విజ్ఞానసేవ.

తెలుగు పండిట్‌, ఎన్‌సీసీ అధికారిగా..

కొడంగల్‌ మండలం సంగాయిపల్లికి చెందిన శివమ్మ, అచ్చప్పల కుమారుడు హన్మయ్య విద్యావంతుడిగా ఎదిగి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో తన విద్యా, ఉద్యోగ జీవితాన్ని కొనసాగించారు. తాను మొదట గ్రామ సమీపంలోని అంగడిరాయిచూర్‌లో ఖాన్గి(ప్రైవేటు), కొడంగల్‌లో జూనియర్‌ కళాశాలలో చదువుకుని, బీఓఎల్‌, ఎంఓఎల్‌, బీకాం, ఎంఏ, ఎంఫిల్‌, ఎంఈడీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తిచేశారు. 1980–81లో మొదటి అపాయింట్‌మెంట్‌ పొందారు. తెలుగుపండిత్‌గా, ఎన్‌సీసీ అధికారిగా పనిచేశారు. 2011లో ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ పొందారు. పీఆర్టీయూ నాయకుడిగా ఎన్నో వినూత్న కార్యక్రమాలు నిర్వహించారు.

సొంతూరు సేవకు..

మాతృభూమి, స్వగ్రామానికి సేవచేయాలనే సంకల్పంతో విద్య, ఆధ్యాత్మికం అంశాలను ఎంచుకున్నాడు. నాలుగేళ్ల క్రితం ఆంజనేయస్వామి ఆలయం నిర్మించాడు. ప్రస్తుతం తన తల్లి శివమ్మ పేరిట రూ.30లక్షల ఖర్చుతో గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేశాడు. సాహిత్యం, చరిత్ర, వేదాలు, పురాణాలు, కథలు, ఆధ్యాత్మికం, పోటీ పరీక్షల పుస్తకాలు, బీఈడీ, ఎల్‌ఎల్‌బీ, డీఎడ్‌, బీఎడ్‌, గ్రూప్స్‌ ప్రిపరేషన్‌, మహిళలు, చిన్నారులకు సంబంధించిన వందలాది పుస్తకాలను ఈ గ్రంథాలయంలో ఉంచి విజ్ఞానవంతులను చేయాలని పూనుకున్నాడు.

నేడు కోదండరామ్‌ చేతులమీదుగా..

సంగాయిపల్లిలో ఏర్పాటు చేసిన ఈ గ్రంథాలయాన్ని సోమవారం ప్రొఫెసర్‌ కోదండరామ్‌ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్‌, పలువురు నాయకులు తదితరులు హాజరుకానున్నారు.

నాల్గో వంతు విద్యార్థులకు



నాకు మల్కాజ్‌గిరి జెడ్పీహెచ్‌ఎస్‌ (బాలుర) విద్యార్థులు మరోజన్మనిచ్చారు. ఈ పాఠశాలే నా సేవలకు జీవం పోసింది. నేను ఉద్యోగం చేసేటప్పుడు వేతనంలో నాల్గవ వంతు విద్యార్థులకు ఖర్చుచేశాను. దానధర్మాలు చేసి నావంతు సేవ చేశాను. రంగనాథాచార్యుల సలహాతో బీఓఎల్‌ను బీఏఎల్‌గా మార్చేందుకు కృషి చేశాను. యూనివర్సిటీలో పీడీఎస్‌యూలో, ఉద్యమాల్లో పాల్గొన్నాను. ప్రస్తుతం గ్రంథాలయం నిర్మించి సేవచేయాలనుకున్నాను. ఇది కార్యరూపం దాల్చడం ఆనందంగా ఉంది.

– హన్మయ్య, రిటైర్డ్‌ హెచ్‌ఎం, సంగాయిపల్లి

ఇంటర్‌ విద్యార్థిని అదృశ్యం



సబా తబస్సుమ్‌(ఫైల్‌)

పహాడీషరీఫ్‌: ఇంటర్‌ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వాదే ముస్తఫా బస్తీకి చెందిన షరీఫ్‌ కుమార్తె సబా తబస్సుమ్‌(19) ఇటీవలే ఇంటర్‌ పూర్తి చేసింది. సమీపంలోనే ఉండే హసీబ్‌ అనే యువకుడితో తరచూ ఫోన్‌ మాట్లాడుతుండడాన్ని గమనించిన తండ్రి మందలించాడు. దీంతో ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఈ నెల 20న ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఎంతకి ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు సాధ్యమైన అన్ని ప్రాంతాలలో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు ఖాయం

- మోదీ నాయకత్వంలోనే అభివృద్ధి సాధ్యం
- బైక్‌ ర్యాలీలో కొండా తనయుడు విశ్వజిత్‌రెడ్డి



జెండా ఊపి బైకు ర్యాలీని ప్రారంభిస్తున్న కొండా విశ్వజిత్‌ రెడ్డి

తాండూరు టౌన్‌: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ చేవెళ్ల అభ్యర్థిగా తన తండ్రి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం ఖాయమని ఆయన తనయుడు విశ్వజిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బైక్‌ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్న ఈ ర్యాలీ విలియంమూన్‌ చౌరస్తా నుంచి ప్రారంభమై పట్టణంలోని పలు వీధుల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా విశ్వజిత్‌ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే దేశానికి గుర్తింపు తెచ్చిన గొప్ప నాయకుడు ప్రధాని మోదీ అన్నారు. ఆయన పాలనలో దేశ ప్రజల అభ్యున్నతి, ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. మోదీని మూడోసారి ప్రధానిని చేసేందుకు ప్రజలకు సిద్ధమయ్యారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్‌కుమార్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్‌, నాయకులు బాలేశ్వర్‌ గుప్తా, సాహు శ్రీలత, బొప్పి శ్రీహరి, జుంటుపల్లి వెంకట్‌, భద్రేశ్వర్‌, నాగారం మల్లేశం, కిరణ్‌ ముదిరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో కుటుంబ సభ్యుల జోరు



మొయినాబాద్‌రూరల్‌: అప్పారెడ్డిగూడలో ప్రచారం చేస్తున్న సీతారంజిత్‌రెడ్డి



చేవెళ్ల: శంకర్‌పల్లిలో రంజిత్‌రెడ్డి తనయుడు ఆర్యన్‌రెడ్డి ప్రచారం

రంజిత్‌రెడ్డి కోసం రంగంలోకి సతీమణి, తనయుడు

చేవెళ్ల/మొయినాబాద్‌ రూరల్‌: లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌ వెలువడడంతో ఎలక్షన్‌ సందడి నెలకొంది. ప్రజల ఓట్లు రాబట్టేందుకు నేతలంతా ప్రచారంలో బిజీగా గడుపుతున్నారు. ఓటర్లను ఆకర్శించేందుకు పోటీదారుల కుటుంబ సభ్యులను ఎన్నికల ప్రచారంలో దింపుతున్నారు. ఆదివారం చేవెళ్ల సిట్టింగ్‌ ఎంపీ రంజిత్‌రెడ్డి గెలుపుకోసం ఆయన సతీమణి సీతారంజిత్‌రెడ్డి, కుమారుడు ఆర్యన్‌రెడ్డి వేర్వేరు చోట్ల ప్రచారం చేపట్టారు. పార్లమెంట్‌ ఎన్నికల్లో రంజిత్‌రెడ్డి విజయం కోసం అప్పారెడ్డి గూడలో ఆయన సతీమణి సీతారెడ్డి చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్‌, టీపీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షాబాద్‌ దర్శన్‌తో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. అభివృద్ధి, సంక్షేమం కోసం రంజిత్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుందామన్నారు. ఈ ప్రచారంలో ఆమె వెంట డీసీసీ ఉపాధ్యక్షుడు కొత్త జైపాల్‌రెడ్డి, మత్స్యకార సంఘం జిల్లా చైర్మన్‌ మహేందర్‌ముదిరాజ్‌, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు మాణయ్య, ఎంపీటీసీ సభ్యుడు రాంరెడ్డి, మర్రి రవీందర్‌రెడ్డి, అప్పారెడ్డిగూడ నాయకులు కరణ్‌కుమార్‌, వెంకటేశ్‌ పాల్గొన్నారు.

చందిప్పలో తనయుడి ప్రచారం

తన తండ్రిని గెలిపిస్తే అందరికీ అండగా ఉంటూ ఆరు గ్యారంటీల అమలుకు కృషి చేస్తాడని.. తనయుడు ఆర్యన్‌రెడ్డి అన్నారు. ప్రచారంలో భాగంగా ఆయన భీంభరత్‌, ఎన్నికల ఇన్‌చార్జి సత్యనారాయణరెడ్డితో కలిసి శంకర్‌పల్లి మండలం చందిప్పలో పర్యటించారు. హస్తం గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీ అందించాలని కోరారు. రంజిత్‌రెడ్డి ఎంపీగా గెలిపిస్తే మన ప్రాంతానికి మరింత అభివృద్ధి జరుగుతుందని వివరించారు. ఈ ప్రచారంలో టీపీసీసీ కార్యదర్శి ఉదయ్‌మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మున్సిల్‌ అధ్యక్షుడు ప్రకాశ్‌, కౌన్సిలర్లు చంద్రమౌళి, శ్రీనాథ్‌గౌడ్‌, రవీందర్‌రెడ్డి, ఎజాస్‌, మైసయ్య, యాదయ్య, శ్రీశైలం, ప్రవీణ్‌కుమార్‌, శ్రీధర్‌, పాండురంగారెడ్డి, శ్రీధర్‌గౌడ్‌, రామచంద్రారెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, ప్రవీన్‌, బల్వంత్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులున్నారు.